
# అద్భుతాలు చేసే మనిషి

కథ

డా॥ వి.చంద్రశేఖరరావు



**మొదట్లో, అదో చిన్న ఊహ మాత్రమే. సన్నటి ఎండ పొడ, తేమగా ఉన్న జూలై నెల ఉదయం, కాళ్ళ కింద గరుకు రోడ్డు. అంతా సహజమైన వాతావరణంలో; రేఖామాత్రమైన ఊహ, గాఢమైన కోర్కెలా మారి- చేతులు రెండూ సిలువ రెక్కల్లా సాచి, ఒక్కసారిగా బ్రిడ్జి పై నుండి కిందకు దూకాను. 'అరెరెరె'... అంటూ కేకలు వినిపిస్తూనే ఉన్నాయి. బ్రిడ్జి పై నుంచి దూకిన తరువాత 'వాంఛ' పూర్ణ రూపం దాల్చింది. మాలతినొకసారి గుర్తు చేసుకున్నాను. ఏదీ ఆ క్షణం! సమస్త స్వప్నాలకు, దుఃఖాలకు ఫుల్‌స్టాఫ్ లాంటిది.**

తరువాత దృశ్యంలో, అనుకొన్న రైలు వెళ్ళిపోయి, బ్రిడ్జికి కిందనున్న పట్టాకు మధ్యనున్న టెలిఫోన్ తీగల్లో ఇరుక్కుని, వేలాడుతూ; ఎదురు చూసిన మరణం ఆగిపోయింది. పేపర్ వాళ్ళకు వెరైటీ న్యూస్ డ్రామా. 'మరణపు అంచుదాకా వెళ్ళిన కవి'. 'కవి మోహన శంకరం హరాకిరి' 'ఆత్మహత్యల రుతువులో కవులు కూడా...' సంతాపాలు, జాలి, అయ్యో అయ్యోలు. మాలతి కళ్ళలో విషాద మోహనం! నిర్లిప్తం. 'ఎందుకు' అనే ప్రశ్న, ఆశ్చర్యం. దిగులు దిగులుగా ఆ ఒక్క రోజూ గడిచాక మళ్ళీ ముఖం చుట్టూ మాస్క్‌ని బలంగా తగిలించాను. మళ్ళీ అన్ని పాత్రలూ, సంఘటనలూ కథ మొదలైంది.

** ** **

ఇరవైఏడేళ్ళ కొడుకు ఎటో వెళ్ళిపోయాడు. మూడేళ్ళుగా అతని గురించిన కబురులేదు. అసలు దుఃఖం కవిత్వం రాయలేక పోవటం. పదహారు సంపుటాలు ప్రచురించినాక, కవిత్వానికి అతను చిరునామా అని పొగిడించుకున్నాక, అంతటా కవిత్వపు గాలులు వీస్తుంటే, రెండేళ్ళుగా, ఒక్క కవిత కూడా రాయలేకపోవటం. రాత్రులు నిద్రపట్టదు. పక్కనే గాఢనిద్రలో మాలతి. కొద్దిగా అసూయవేసి, ఆమెను నిద్రలేపాలని పిస్తుంది. అర్ధరాత్రి వేళ లేచి, వరండాలో కూర్చుని, కలం, నోట్‌బుక్ తీసుకొని, ఊహు, ఒక్క వాక్యమూ బయటకు రాదు. అరవైయేళ్ళ వయసు కవిత్వాన్ని స్వప్నించే వయసు కాదా? రెండురోజుల క్రితం ఒక వింత కల వచ్చింది. చీకటి గదిలో నేను. ఎదురుగా మహాకవి నెరూడా. గంభీరమైన చిరునవ్వు. అందమైన నల్లని సూటు. 'రా, బయటకు వెళ్దాం' అంటూ గది తలుపు తెరిచాడు. ఆ తలుపు వెనుక ఉన్నది 'మరణపు గది' అని తెలుసు నాకు. అది ఆయనకు చెప్పాలని ప్రయత్నం. నోరు పెగలలేదు. తలుపు తీసి ఆయన బయటకు నడిచాడు. ఆశ్చర్యం. మృతదేహాలన్నీ అందమైన కవితలుగా మారాయి. వందలాది కవితల మధ్య విలాసంగా నడుస్తూ నెరూడా. అయితే నా అడుగులు పడుతూనే ఆ కవితలన్నీ మళ్ళీ మృత దేహాలవుతున్నాయి. నా కాళ్ళ కింద శవాలు. ఎన్నో యేళ్ళ క్రితం చనిపోయి, చర్మం బిగుసుకుపోయి, కుళ్ళిపోయి.

ఈ కల మాలతికి చెప్పాలని రెండురోజులుగా ప్రయత్నం. ఊహు, కవిత్వం మాట వింటూనే ఆమె ముఖంలో అశాంతి. విసుగు. వంటా వార్పు పూర్తయినాక, పగలంతా తన డస్క్‌పై కూర్చుని గవర్నరుకో, హోం మినిస్టరుకో వినతిపత్రం రాస్తూ గడుపుతుంది. పది పేజీల దాకా ఉంటుందా అర్జీ. మొత్తం సంఘటనను ఆర్ద్రంగా వర్ణిస్తుంది. పిల్లవాడి పరిచయాలను, రాజకీయాలను వివరిస్తుంది. వందకు పైగా అనుమానితుల లిస్టు ఇస్తుంది. అర్జీలన్నీ రిజిస్టరు పోస్టులోనే పంపుతుంది. ఆవిడ పెన్షన్‌లో సగం వీటికే ఖర్చు అవుతుంది. "కవిత్వం కాదు, ఎలిజీలు రాయండి. నాకూ, నా బిడ్డకూ" అంటూ పెద్దగా ఏడుస్తుంది.

నెరూడా కల వచ్చినప్పటి నుంచి నాలో ఒక అలజడి. నాకేదైనా సందేశం ఉందా ఈ కలలో అని ఆలోచిస్తాను. అటకపైనున్న పుస్తకాల్ని కిందకు దించి, అందులోంచి 'నీటిగుర్రం' పుస్తకం తీస్తాను. సరిగ్గా పాతికేళ్ళయింది ఈ పుస్తకం రాసి. తలుపులన్నీ మూసి పెద్దగా పోయమ్‌ని చదవటం మొదలుపెడతాను. ఏదో అసంతృప్తి. అయ్యో, ఇలా ఉందేమిటి? మహాకావ్యం అని అందరూ మెచ్చుకొన్న పుస్తకం, ఇంత చప్పగా, నిర్జీవంగా- గొప్పదిగులు. భయం. పాతికేళ్ళ క్రితం అగ్నిలా రేగిన కవిత్వం, ఇప్పుడు బోలుగా అనిపించటం, ఇదీ అరవైయేళ్ళ సిండ్రోమా? కాదు. మళ్ళీ కూర్చోవాలి. నీటి గుర్రాన్ని మళ్ళీ రాయాలి. మొదటి పాదం నుంచీ, మళ్ళీ కొత్తగా, మరోసారి.

** ** **

మధ్యాహ్నం. బయటకు వెళ్ళే సమయం. "అబిడ్స్ వైపు వెళదాం" అంది ఏ వివరాలు ఇవ్వకుండా మాలతి. అటక పైనున్న వందలాది పుస్తకాలు కిందకు దించుతుంది. నీటగుర్రం మొదలుకొని నాలో నేను వరకు. "వీటిని అమ్మేద్దాం, ఇంటి ఖర్చులకన్నా వస్తాయి" అంది. రిక్షాను పిలిపించి, వాటిపై పుస్తకాల కట్టలు వేసి.

ముందు పుస్తకాల బండి, వెనక నేనూ, మాలతి.

ఇదివరకు ఇద్దరం ఇట్లా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్ళేవాళ్ళం. ఏదో పాత పోయమ్‌లో లాగ.

వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. కవిత్వమంత అందమైనదీ హైదరాబాదు. నలభై యేళ్ళ క్రితం నేను కన్న కల హైదరాబాదు లాగా ఉంటుంది.

"హైదరాబాదును తలుచుకుంటే గొప్ప పులకరింత మీకు"

"నాలుగువందల యేళ్ళ నీ పురాతన ఇరానీ సుందరి, గత పదేళ్ళుగా కొద్దికొద్దిగా చచ్చిపోతూ ఉంది. గమనిస్తున్నావా."

"ప్రవక్తలమనుకునే నీలాంటివాళ్ళు దీని పునరుద్ధానం కోసం ఎదురు చూస్తున్నారు గానీ, నాకు మాత్రం ఏ ఆశాలేదు."

మాలతి ఎంతగా భయపెట్టినా ఇప్పటికీ హైదరాబాద్‌పై నా ప్రేమ చచ్చిపోలేదు.

నిజానికి రెండు ప్రేమకథలు నావి. మాలతితో, హైదరాబాదుతో.

ఉద్యోగం ఏమీలేని, నాలుగు కవిత్వం ముక్కల్ని జేబులో వేసుకొని సిటీకొచ్చిన పాతికేళ్ళ పల్లెటూరి మనిషిని, ఇష్టపడి పెళ్ళి చేసుకున్న మాలతి. ట్యూషన్లు చెపుతూ, నెలకు ఐదో, ఆరోవందలు సంపాదిస్తూ, కవిత్వం, సభలు, మిత్రులు అదే జీవితమైన నన్ను తల్లిలా చూసుకుంది మాలతి. మొదటి కవితా సంపుటం తీసుకురావడానికి మెడలో ఉన్న ఒక్క బంగారు పోగును అమ్మింది. రంగురంగుల అట్టతో మెరిసిపోతున్న పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకొని 'ఇది మన ఇంకో సంతానం' అంటూ

మురిసిపోయేది. మొదటి సంపుటాన్ని విమర్శకులు, పదును కత్తులతో ముక్కలు ముక్కలు చేశారు. ఇది కవిత్వమా, ఏదో దీర్ఘ సంభాషణలా ఉంది తప్ప అని. కలం ముట్టుకోవాలంటే భయం వేసేది. అప్పుడూ మాలతే "రాస్తూ పోండి, కాలం, పాఠకులు నిర్ణయిస్తారు మీ ప్రతిభ" అనేది. అప్పట్లో మాలతి ఓ కథ చెప్పేది.


"ఒకప్పుడు ఒక యువకుడుండేవాడు. పాతికేళ్ళ వయసు. అతనికి పెళ్ళికూడా అయింది. అతని భార్య అతన్ని అద్భుతాలు చేసే మనిషని నమ్మేది. అప్పట్లో ఒకరోజు, బహుశా సాయం కాలం సమయంలో కొంతమంది మనుషులు అతని దగ్గరకు వచ్చి 'నీ దగ్గర అద్భుతాలు చేసే శక్తులేవో ఉన్నాయట నిజమేనా?' అన్నారట. ఆ యువకుడు 'అద్భుతాలంటే ఏమిటి?' అని అన్నాడట అమాయకంగా. వాళ్ళు అతన్ని చంపివేశారు. మామూలు మనుషుల మధ్యన అద్భుతాలు తెలిసినవాళ్ళు ఉండకూడదని. అతని భార్య, అతని 'పునరుద్ధానం' గురించి నమ్ముతూ, ఆ కబురే దేశమంతా ప్రచారం చెయ్యటం మొదలుపెట్టింది. కొన్నాళ్ళకు ఆ హంతకులు కూడా చచ్చిపోయారు. వాళ్ళుండే పట్టణాన్ని శత్రు రాజులు ధ్వంసం చేశారు. కొన్నేళ్ళకు మరో యువకుడు అద్భుతాలు చేసేవాడు పుట్టాడు. అతన్నీ చంపివేశారు. ఆ హంతకులూ చచ్చిపోయారు. మళ్ళీ యుద్ధం వచ్చింది. పట్టణం మరోసారి ధ్వంసం అయింది. అంతలో మరో అద్భుతాలు చేసే మనిషిపుట్టాడు. ఈసారి అతని పేరు మోహన శంకరం. హత్య జరిగిన ప్రతిసారీ మరో మోహనశంకరం, 2, 3, 4, 5, 6, అట్లా పుడుతూనే ఉంటాడు."

అట్లాంటి మాలతి, ఇప్పుడు "ఏరీ నీ కవి మిత్రులు, సభలు, కవితా పఠనాలు? అసలు కవిత్వమన్నా



నెరూడా

**చీకటి గదిలో నేను. ఎదురుగా మహాకవి నెరూడా. గంభీరమైన చిరునవ్వు. అందమైన నల్లని సూటు. 'రా, బయటకు వెళ్దాం' అంటూ గది తలుపు తెరిచాడు. ఆ తలుపు వెనుక ఉన్నది 'మరణపు గది' అని తెలుసు నాకు. అది ఆయనకు చెప్పాలని ప్రయత్నం. నోరు పెగలలేదు. తలుపు తీసి ఆయన బయటకు నడిచాడు. ఆశ్చర్యం. మృతదేహాలన్నీ అందమైన కవితలుగా మారాయి. వందలాది కవితల మధ్య విలాసంగా నడుస్తూ నెరూడా.**



బ్రతికి వుందా?" అంటుంది విరక్తిగా.

** ** **

"కవిత్వం పుస్తకాలు
అతి తక్కువ ధరలలో...
కవి ఆటోగ్రాఫ్‌తో సహా
మీ మిత్రులకో గొప్ప బహుమతి;
లేదా మీ డ్రాయింగ్ రూమ్‌కొక
అలంకారం"

నాలుగు రోడ్ల కూడలిలో, రోడ్డు అంచున, స్మగుల్డ్‌సామాన్లు, స్కూలు బ్యాగులు, పోస్టర్లు వగైరా అమ్మే చిన్న సామాన్ల వ్యాపారస్తుల మధ్య నిలబడి మాలతి, పక్కన నేను. పొడవాటి చెక్కబల్లపై రంగురంగుల కవర్లు, వాటికై అందంగా అమర్చిన పుస్తకాలు. రోడ్డుపై నడిచి వెళ్ళేవాళ్ళు ఆసక్తిగా, వింతగా చూస్తున్నారు. షాపింగ్‌కు వచ్చిన ఆడవాళ్ళు పిల్లలు చుట్టూ సూర్యుడి పసుపువచ్చని వెలుగు నేల మీద విరజిమ్మి, ఆ వెలుగు మధ్యన మిలమిలలాడుతుంది మాలతి. ఏడెనిమిది చేతులున్న పురాణ పాత్రలాగా నిలబడి వుంది. గుంపులో బాగా పరిచయమున్న ఒక వ్యక్తి కనబడ్డాడు. ఆయుర్వేదం డాక్టరు. కవిత్వం అంటే చాలా యిష్టం. ఆయన్ని పిలిచి, "రండి సార్, మొదటి పుస్తకం మీరే కొనండి, యాభై రూపాయల పుస్తకం పదికే ఇస్తున్నాము. శంకరం గారి ఆటోగ్రాఫ్ ఫ్రీ..." అంది.

"ఉద్యమాలు అటకెక్కాయి. కవిత్వంపై ఉన్న సమస్త భ్రమలు తొలిగాయి. అప్పులు చేసి, నగలు అమ్మి వేసుకొన్న సంకలనాలు ఇవి. కొత్త ప్రపంచానికి ఇవే నిచ్చెనలు అనుకునేవాడు ఈయన. ఈ నాలుగు పంక్తుల కవిత్వంతో అన్ని చీకట్లు తొలగిపోతాయని నేనూ భ్రమపడేదాన్ని. రిటైర్ అయిన సమయంలో ఇట్లా ఉపయోగపడుతున్నాయి. కవిత్వంపై ఇంకా ఆశచావని వాళ్ళు, రండి, మొదటి పుస్తకం మీరే తీసుకోండి" అంటూ పుస్తకం చేతిలో పెట్టింది. ఆయన మొహమాటపడుతూ పుస్తకం తీసుకొని వందనోటు ఇచ్చి, చిల్లర అడక్కుండానే వెళ్ళిపోయాడు.

క్రమంగా ఆ ప్రదేశంలో మనుషులు మూగారు. నలుగురు అయిదుగురు సాఫ్ట్‌వేర్ కుర్రాళ్ళు, నున్నటి గుండ్రటి ముఖాలతో "ఏమిటీ తమాషా! పొయిట్రీ యిట్లా రోడ్డు మీద అమ్మటం ఏమిటి?" అన్నారు అసహనంగా. వాళ్ళను పట్టించుకోకుండా మాలతి, నన్ను ముందుకు లాగి "మిత్రులారా, ఈయన ప్రముఖ కవి మోహన శంకరం. ఈయన కవిత్వానికి ఎన్నో అవార్డులు వచ్చాయి. ఇతర భాషల్లోకి అనువాదం కూడా అయ్యాయి. కవిత్వానికి కాలం చెల్లిందని కాదు. ఆర్థిక ఇబ్బందుల వల్ల..." అంటూ ఒక్కో పుస్తకాన్ని పైకి ఎత్తి చూపిస్తూ "సరిహద్దురేఖ, హింస, మండే సూర్యుడు వగైరా మొత్తం పదహారు సంపుటాలు" అంది. "కవిత్వం అంటే ఏమిటి?" అంటూ వెనక నుంచి ఎవరో అరిచారు. జనం ముందుకు వచ్చి పుస్తకాలు తిరగేస్తున్నారు.

ఏ హెచ్చరికా లేకుండా, హఠాత్తుగా మా ఇద్దరి చుట్టూ కాంతి వలయం ఏర్పడింది. తెల్లని వెలుగులు. టి.వి కెమెరాతో, మైక్‌తో ఇద్దరు యాంకర్లు ప్రత్యక్షమయ్యారు. "నేను ఆనంద గీతను, హైదరాబాద్ అబిడ్స్, ఫుట్‌పాత్ పై నుంచి రిపోర్టు చేస్తున్నాను. ఇక్కడ ఫేమస్ రైటర్ మోహన శంకరం ఉన్నాడు. ఆయన ఏ పరిస్థితులలో పుస్తకాల్ని ఇట్లా అమ్ముకోవాలనుకుంటున్నాడో వివరిస్తారు" అంటూ నావైపు కెమెరా ఫోకస్ చేశారు.

నాలో కోపం, విసుగు. అంతలోనే సర్దుకొని "అవును, కవిత్వాన్ని అమ్మక తప్పటం లేదు. ఇప్పుడు అమ్మకపోతే గర్భంలోనే చనిపోయే శిశువులాగా, కొన్నాళ్ళకు వీటిని నేను సమాధి చేసుకోవాలి. నేను చాలా



నిరాశగా ఉన్నాను. ఎక్కడా వెలుతురు లేదు. రిటైర్ అయ్యాను. డబ్బులు చాలటం లేదు అనేది ఒక నెపం మాత్రమే. ఇది ఒక గిమ్మిక్. ఎటు నుంచైనా, చిన్న ఆశైనా పుట్టకపోతుందా అనే ఒక చివరి ప్రయత్నం. ఏదైనా అద్భుతం కోసం చేసే ఒక ఫీట్..." అన్నాను.

కెమెరాకు, యాంకరుకు నా భాష అర్థమయినట్లు లేదు. "మీ పుస్తకంలోంచి ఒక కవితను చదవండి" అంది. క్షణంసేపు మౌనం. కానీ లోపల ఒక ఉద్వేగం. మంద్రంగా, సన్నటి దుఃఖపు జీరతో, చిట్ట చివరి ప్రార్థనలా కవితను చదవటం మొదలుపెట్టాను.


"ఇప్పుడే పద్యం నీ కోసం
నీ లోపలి పురాతన క్రోధావేశం కోసం
రెక్కలు విప్పుకునే ఒక చప్పుడు కోసం
'స్వేచ్ఛ' అనే పదంగా
నువ్వు రూపాంతరం చెందే ప్రక్రియ కోసం
నీ ప్రతిఘటన కోసం
రేపటి నీ కథ కోసం
ప్రియతమా, నా హైదరాబాద్ -"

మాలతి ప్రశంసగా నావైపు చూస్తుంది. నిజానికి కవిత్వం చదవటమనే కళను మాలతే నాకు నేర్పింది. పొడవాటి జుట్టు, కళ్ళజోడు, భుజాన సంచి, హైదరాబాద్ గెటప్ కూడా మాలతి నేర్పిందే. కవిత్వం కోసం ఒక పత్రిక నడుపుదామని మాలతే ప్రోత్సహించింది. 'మొదటి తిరుగుబాటు' దాని పేరు. కవిత్వానికి పత్రికలు, కాలమ్స్ లేని రోజుల్లో అదో. గొప్ప సంచలనం. పదేళ్ళు నడిపినాక, సెంట్రల్ యూనివర్సిటీ కుర్రవాళ్ళు దాని బాధ్యత తీసుకొన్నారు. తొంభైలనాటికి అది దళిత ఉద్యమ పత్రిక అయ్యింది. రెండు దళిత ఉద్యమాలను చూసింది. క్రమంగా అది NGOల చేతుల్లోకి వెళ్ళింది. మొదట్లో మా యింట్లోను, తరువాత సెంట్రల్ యూనివర్సిటీ హాస్టల్‌లోను బ్రతికిన 'మొదటి తిరుగుబాటు' ఇప్పుడు ఎ.సి. గదులకు మారింది. సంస్థాపక ఎడిటర్‌గా ఇంకా దానిపైన నా పేరు ఉండేది. 'మొదటి తిరుగుబాటు' చనిపోయిందని, దాని సంస్థాపక ఎడిటర్‌గా దాని 'ఆబిట్యురీ'ని 'ఒక పత్రిక మరణం' పేరుతో రాస్తున్నానని' ఆ మొత్తం ప్రకటన మాలతే రాసింది. సంతకం నాది. ('మొదటి తిరుగుబాటు' పేరు మార్చుకొని ఇప్పుడు 'రెండో తిరుగుబాటు' అయ్యింది, ఆ తరువాత)

"నా పోయమ్‌ని నీకిస్తాను, తీసుకో"
నీ ప్రియురాలికివ్వు
ఏమో, ఆమె దాన్ని ఇష్టపడవచ్చు
మీ స్వీట్ నథింగ్స్ మధ్యన నా పోయమ్‌ని
తలుచుకొని పెద్దగా నవ్వుకోండి
కాసేపయినాక కొద్దిగా ఆశ్చర్యం నటించండి
ఎందుకంటే
ఇది మనిషి గురించిన పోయమ్..."

మరో కవిత చదివాను. గొంతు కొద్దిగా బొంగురు బోయి హైపిచ్‌లో, పొడవాటి గొట్టంలోంచి విరజిమ్మిన నీటిప్రవాహంలా. సుమారు యాభైమంది దాకా ఉన్నారు అక్కడ. కవిత చదవటం ఆపగానే చప్పట్లు కొట్టారు. వెనుకనున్న కుర్రాళ్ళు వన్స్ మోర్, వన్స్ మోర్ అంటూ అరిచేరు. మాలతి ముఖం క్రమంగా విచ్చుకోవటం మొదలైంది. వెనుకనుంచి ఎవరిదో కంఠం, నలభైయేళ్ళ ఆడమనిషి, గొంతెత్తి, ఆశువుగా, ఒక కవిత చెప్పటం మొదలు పెట్టింది. "మోహన శంకరంగారి కవితలు మాకు కంఠతా వచ్చు" అంది.

"ఈ వీధులకు నాభాష తెలుసు..." అంటూ



కవిత్వం కోసం ఒక పత్రిక నడుపుదామని మాలతే ప్రోత్సహించింది. 'మొదటి తిరుగుబాటు' దాని పేరు. కవిత్వానికి పత్రికలు, కాలమ్స్ లేని రోజుల్లో అదో గొప్ప సంచలనం. పదేళ్ళు నడిపినాక, సెంట్రల్ యూనివర్సిటీ కుర్రవాళ్ళు దాని బాధ్యత తీసు కొన్నారు. తొంభైలనాటికి అది దళిత ఉద్యమ పత్రిక అయ్యింది. రెండు దళిత ఉద్యమాలను చూసింది. ● క్రమంగా అది NGOల చేతుల్లోకి వెళ్ళింది.

ఆ అజ్ఞాత పాఠకురాలు కవిత చదువుతుంటే, నాలో ఒక జలదరింత. ఆ మధ్యాహ్నం వేళ, కవిగా నా విజయం, అట్లా నాలుగురోడ్ల కూడలిలో, ఫుట్‌పాత్‌పై మూగిన జనం మధ్యలో పుట్టుకొస్తుందని ఊహించలేదు. టి.వి కెమెరా లైట్లు ఆగిపోయాయి.

** ** **

రోడ్డు చివర్న కాఫీ హోటల్. 'హంస' దాని పేరు. సాయంకాలం నాలుగు గంటల సమయానికి అక్కడ చేరి, కిటికీ పక్క టేబుల్‌పై కూర్చుని, హంస మూసేసేదాకా అక్కడే ఆరోసారో, పదోసారో కాఫీ తాగుతూ, కవిత్వం చదువుకుంటూ గడపటం. ఒకప్పుడిది హంసల దీవిలా ఉండేది. హోటల్ అంతా కవిత్వం నాసన వేసేది. కవులు, కవిత్వం, చర్చలు. ఇప్పుడిక్కడ టీనేజీ అమ్మాయిలు, సాఫ్ట్‌వేర్ కుర్రాళ్ళు. కాఫీ, కోక్‌లు, 'బిచ్' 'ఫక్' 'బోర్' అంటూ కేకలు, ఖరీదైన సెంటు, చెమట, కలలు, కోర్కెలు కలిపిన వింత పరిమళం హోటల్ నిండా.

పొద్దుపోయింది. హంస ఖాళీగా ఉంది. కిటికీ పక్క సీటులో. కిటికీ పక్కనే పొడవాటి క్రోటన్ చెట్టు. బయట రోడ్డు నిశ్శబ్దంగా. అలిసి పోయి నట్లుగాఉంది. వెయిటర్ బాగా పరిచయమున్న వాడే. కాఫీ తెచ్చి ఇచ్చాడు.

"సార్, ఈ మధ్య రెగ్యులర్‌గా రావటం లేదు."

"మీరు చచ్చిపోయారని పుకారు వచ్చింది. మామూలుగా చచ్చిపోవటం కాదని, సూసైడని..."

ఉలిక్కిపడ్డాను.

'సార్, బాగా నలిగిపోయినట్లున్నారు. ఏం సార్, కవులు, మీక్కూడా బాధలేంటి సార్!'

పాతికేళ్ళ కుర్రాడు ఆ వెయిటర్. ఇంకా జీవితపు దిగులు ముఖంపైకి యింకలేదు. కిటికీ లోంచి బయటకు చూస్తే, రోడ్డు ఖాళీగా, నిశ్శబ్దంగా ఉంది. చెట్టు పైనుంచి ఆకులు ముందుకు తోసుకొచ్చి, నాపైన గొడుగులా నిలబడ్డట్టు, అటూ ఇటూ కదులుతూ; రోడ్డుపై ఒక అమ్మాయి, పోలీసూ హడావుడిగా నడుస్తున్నారు.

నెరూడా పుస్తకాన్ని తెరిచి "poetry arrived in search of me..." అంటూ పెద్దగా చదవటం మొదలు పెట్టాను. ఇద్దరు వెయిటర్లు, మరో ముసలి వెయిటరు అక్కడకు వచ్చారు. ఆసక్తిగా ముఖం పెట్టారు.

వాళ్ళలోంచి ఒక ముసలి వెయిటర్ హఠాత్తుగా "మీరట్లా చేసి ఉండాల్సింది కాదు" అన్నాడు. "అట్లా చచ్చిపోవటం కన్నా తాగుబోతులు కావటం బెటరు". "తుక్కురేగ తాగండి. రోజంతా తాగండి సార్."

"ఇంకో కాఫీ తెస్తాను సార్" అంటూ కుర్రాడు లోపలికి నడిచాడు. "మీరు కూడా తలో కాఫీ తెచ్చుకోండి. బిల్లు నేనిస్తాను. రండి కుర్చీలు లాక్కోండి" అన్నాను. వాళ్ళు కూర్చో లేదు.

"మీకెంత సార్, అరవై ఉంటాయా?" అన్నాడు మళ్ళీ ముసలి వెయిటర్. "ఇంటికి వెళ్ళిపొండి సార్! పదికల్లా ఇంటికి చేరండి. మన కోసం అమ్మో, పెళ్ళామో ఎదురుచూస్తూ ఉంటారు. అట్లా ఒక మనిషి మనకోసం ఎదురుచూస్తూ ఉంటే చచ్చిపోవాలని ఎట్లా అనిపిస్తుంది సార్, ఏం సార్ మీకెవరూ లేరా?" అన్నాడు. నేనేం మాట్లాడలేదు. కిటికీ వైపే చూస్తున్నాను.

"చదవండి, వింటుంటే బాగుంది" అన్నాడు కుర్ర వెయిటర్ కాఫీ ఇస్తూ.

శీతాకాలము మీదుగానో, నది మీదుగానో
ఎప్పుడు ఎట్లా వచ్చిందో తెలియదు
నన్ను పిలిచిన వీధుల నుంచీ కాదు
రాత్రి చీలికల నుంచీ కాదు
హఠాత్తుగా ఎవరి నుంచో
లేదా ఒంటరిగా తిరిగి వస్తూనో
ఖాళీ ముఖంతో నేను,
అప్పుడు కవిత్వం
నన్ను దయగా స్పృశించింది-

"బాగుంది. అర్థం కావటం లేదుగానీ వింటుంటే బాగుంది సార్" అన్నాడు ముసలి వెయిటర్.

"సార్, నా దగ్గర బ్రాందీ ఉంది. గ్లాసు తెస్తాను. కొంచెం తీసుకోండి సార్, దిగులు తగ్గిపోతుంది..." అన్నాడు ప్రేమ, దయ గల కళ్ళతో. ఆ ముసలి వెయిటరును ముట్టుకోవాలనిపించింది. దగ్గరకు లాక్కుని 'నాయనా' అంటూ ఎదవాలనిపించింది. లేచి పర్సులోంచి వందనోటు తీసి "ముగ్గురూ ఉంచుకోండి" అన్నాను.

"సార్ కాసేపు ఉండండి, షట్టర్లు వేసేస్తాము.

లోపల కూర్చుందురుగాని..."

"సార్ కాసేపు ఉండండి, షట్టర్లు వేసేస్తాము. లోపల కూర్చుందురుగాని..."

"లేదు, వెళతాను. ఆమె ఎదురు చూస్తూ ఉంటుంది." లేచి ముందుకు నడిచాను. 'గుడ్ నైట్ సార్!' అన్నారు వాళ్ళు ముగ్గురూ కలిసి. బయట చెట్టు గాలికి అటూఇటూ ఊగుతూ, నీడలు బాట పొడవునా పరచుకున్నాయి. వాళ్ళు ముగ్గురూ ప్రేమగా చేతులు ఊపుతున్నారు. వాళ్ళు ముగ్గురూ పద్యంలోని పాదాల్లా తోచారు.

** ** **

హంసను మూసివేశారు. మళ్ళీ రోడ్డుపైకి. రోడ్డుపై వాహనాల రద్దీ తగ్గింది. చల్లటి గాలి. మెరిసిపోయే నియోన్ లైట్లు. బంగళాలు.అపార్ట్ మెంట్లు, వాటి చుట్టూ ఎత్తైన గోడలు.

గోడల పునాదుల్లో ఒక భయమూ, అభద్రతా; గోడ లన్నిటి వెనుకా ఒక కుట్ర ఉంటుంది.

నడుస్తూంటే, సెంట్రల్ యూనివర్సిటీ కనబడింది. ప్రహరీగోడ ఎత్తుగా, భయం గొలిపేలా ఉంది.గోడ బయట పగిలిన బీరుబాటిళ్ళు, ప్లాస్టిక్ కప్పులు, చెత్తకుప్ప. వాటిపైన ఎగురుతూ వందలాది సీతాకోక చిలుకలు.

మూడేళ్ళ క్రితం కూడా ఇదే దృశ్యం.

ఎత్తైనగోడ,చల్లటి ఈదురుగాలి. పగిలిన సీసాలు, చెత్తకుప్ప,అక్కడక్కడ పచ్చిక మొలకలు.ఒక ఒంటరి సీతాకోకచిలుక, గోడకు వేలాడుతూ. మూడేళ్ళ క్రితం దృశ్యంలో మాలతి ఉంది. గేటు బయట ఇరవై అయిదేళ్ళ అమ్మాయి శవం ఉంది. రిసెర్చి స్కాలర్. లైంగిక హింసకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది. ఉత్తరంలో మా వాడి పేరు ఉంది.వాడి హింసకు తట్టుకోలేక చనిపోతున్నానని.గేటు దగ్గర గుంపులుగా విద్యార్థులు. పోలీస్ వ్యాన్.

"నేను నమ్మను. ఇదంతా కుట్ర. కవిత్వం, కాగితాలు అల్పసంతోషాల కుటుంబంలో ఇట్లాంటి వాడు పుడతాడా?" అంటూ ఏడ్చింది మాలతి.

"మేం హంతకులం కాము" అంటూ ముమ్మారు అరిచింది.

మూడేళ్ళుగా యూనివర్సిటీ చుట్టూ తిరుగుతున్నాను. గోడల నిండా రంగురంగుల సీతాకోక చిలుకలు వేలాడుతూ, ఇక్కడ ఉండకూడనివి. ఏ అడవుల్లోనో, పల్లెల్లోనో ఉండవలసినవి.నడుస్తుంటే పాదాలకింద పడి నలిగిపోతాయి.ఎర్రగా, ఆకుపచ్చగా, నీలంగా, రోడ్డు పైనంతా మరకలు. రోడ్డు క్షతగాత్రమైన శరీర మవుతుంది.

పారిపోయినవాడు ఎందుకట్లా చనిపోవాలని నిర్ణయం తీసుకున్నాడో తెలియదు. అంత హృదయవిదారకంగా ఎత్తైన బ్రిడ్జి మీద నుంచి దూకి, పరుగెత్తే రైలుకు శరీరాన్ని అప్పగించి, వందలాది ముక్కలుగా-వంద కిలోమీటర్లు పారిపోయి మరీ చనిపోయాడు. ఈమరణ రహస్యం తల్లికి కూడా తెలియదు. శరీర భాగాలన్నీ ఒకటిగా కుట్టగలిగితే చెబుదామనుకున్నాను. సాధ్యం కాలేదు.

యూనివర్సిటీ దగ్గరకు రాగానే వాడు గుర్తుకొస్తాడు. "రా, రంగురంగుల సీతాకోక చిలుకలు చూపిస్తాను" అంటాడు.ఇద్దరం రోడ్డు దాటి, సిటీ దాటి, అడవుల వైపు వెళతాము. అయితే అక్కడ అన్నీ ఆకులు లేని చెట్లు. నగానికిపైగా నరికి వేయబడి; మొండిచెట్లపై చచ్చిపోయిన సీతాకోక చిలుకలు. అక్కడ దాకా నాతో నడిచి, హఠాత్తుగా మాయమవుతాడు వాడు. సీతాకోక చిలుకలా మారి చెట్టుకు అతుక్కుపోతాడు.

ఆకుపచ్చని మరకలా వాడు గుర్తుకొస్తూనే ఉంటాడు.

** ** **

అర్ధరాత్రి నిద్రలోంచి ఉలిక్కిపడి లేచాను.

ఎందుకో నాయన గుర్తుకొచ్చాడు. 'యాయ్యా, ఇట్టా వచ్చావే...' అని పలకరిస్తున్నాడు. చివరి దాకా పల్లెలోనే ఉన్నాడు. పోయే సమయానికి ఎవరూ పక్కన లేరు.శవాన్ని లేపే సమయానికి పల్లె చేరాను. "శంకరయ్యా, చివరిదాకా నిన్నే కలవరించాడయ్యా" అంటూ గొల్లుమన్నారు బంధువులు.

దగ్గరగా వెళ్ళి చూస్తే ఒక జలదరింత. నెరూడా మహాకవి. ఒక్కడే కూర్చుని. గొప్ప ఉద్వేగం. మహాద్భుతం చూస్తున్నట్లుగా. వెళ్ళి ఆయన పక్కన కూర్చున్నాను.

ఎందుకో పల్లె గుర్తుకొచ్చింది. బస్సు కింద పడి చచ్చిపోయిన లేగ దూడ గుర్తుకొచ్చింది. పొలాల చుట్టూ బాణాకర్రలతో మాటువేసే పంట దొంగలు గుర్తుకొచ్చారు. పూజలు నోచుకొని ఎప్పటిదో ఒక గుడి ఇళ్ళ మధ్య నుంచి ఎత్తుగా కనిపించేది. అది గుర్తుకొచ్చింది.

ఏపుగా ఎదిగిన జొన్నచేల మధ్య నడక, నడిపొద్దుఎండలో శరీరాన్ని ఆరబెట్టుకోవటం, జొన్న కంకులపై ఎగిరే పాలపిట్టలు, కీచురాళ్ళ చప్పుడు, ట్రిప్, ట్రిప్‌మంటూ ఎగిరే పిట్టలు, ఎక్కడి నుంచో ఎహేయ్ ఎహేయ్‌మంటూ అరుపులు, తూములోంచి తోసుకొస్తున్న నీళ్ళ వరుగు, గట్టుమీద పంచె ఎగగట్టి, గడ్డి పెరుకుతూ 'యాయ్యా, ఇట్టా వచ్చావే" అని పలకరించే మనిషి గుర్తు కొచ్చారు.

మధ్యాహ్నం అబిడ్స్ సెంటర్‌లో కవిత చదివిన ఆడమనిషి గుర్తుకొచ్చింది. దయగల కళ్ళతో వలకరించిన ముసలి వెయిటర్ గుర్తుకొచ్చాడు.

లేచి గేటు తెరుచుకొని రోడ్డుపైకి వచ్చాను.

రోడ్డు పక్కనే ఒంటరిది, ఒక ఇనుప బెంచీ కనిపించింది. దానిపై ఎవరో వంటరిగా కూర్చున్నాడు. అతన్ని పలకరించాలని కోర్కె కలిగింది. ముందుకు నడుస్తుంటే శీతాకాలపు రాత్రి రాలుస్తున్న పల్చటి ఆకులు కాళ్ళకు మెత్తగా తగలుతున్నాయి. దగ్గరగా వెళ్ళి చూస్తే ఒక జలదరింత. నెరూడా మహాకవి. ఒక్కడే కూర్చుని. గొప్ప ఉద్వేగం. మహాద్భుతం చూస్తున్నట్లుగా. వెళ్ళి ఆయన పక్కన కూర్చున్నాను.

క్రమంగా ఇళ్ళు, మనుషుల ఆనవాళ్ళు, నగరం, ధ్వని సమస్తం అదృశమయిపోయి, రోడ్డు, దానిపక్కనే ఒకే ఒక బల్ల, దానిపై నేనూ, నెరూడా.

వేకువజామున మాలతి బయటకు వచ్చి పలకరించే సమయానికి, నాచేతిలో కొత్త పోయమ్.

---

## ఆదివారం క్విజ్

*** ఆధ్యాత్మికం**

1. మనిషి దేవుడిని సృష్టించాడే కానీ, దేవుడు మనిషిని సృష్టించలేదన్న ప్రముఖ తత్వవేత్త ఎవరు?

*** సాహిత్యం**

2. వ్యావహారిక భాషోద్యమ పితామహుడెవరు?

*** రాజకీయం**

3. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలో ఫ్యాక్షనిజాన్ని అణచి వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పేరేమిటి

*** కళలు**

4. నైరూప్య చిత్రకళకు (అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్) ఆద్యుడైన చిత్రకారుడెవరు? ఏ దేశస్థుడు?

*** శాస్త్ర విజ్ఞానం**

5.డి.టి.ఎస్. అంటే ఏమిటి?

సమాధానాలు వచ్చేవారం

## గతవారం ప్రశ్నలకు సమాధానాలు

* ఆధ్యాత్మికం: 1. కొవ్వూరులో మల్లేశ్వర స్వామివారిని ప్రతిష్ఠించినది గణపతిదేవుడు.

* సాహిత్యం: 2. ఎ.పి.జె.అబ్దుల్ కలామ్ - సైంటిస్ట్ అండ్ హ్యూమనిస్ట్ పుస్తక రచయిత **అతులింద్రనాథ్ చతుర్వేది.**

* రాజకీయం: 3.భారత సంతతికి చెందిన అనిరుధ్ జగన్నాథ్ **మారిషస్‌**కు ప్రధానిగా ఉన్నారు.

* కళలు: 4. అమెరికన్లకు ఫ్రెంచివారు కానుకగా అందజేసిన విగ్రహం **స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ.** దాని రూప శిల్పి **ఫెడరిక్ ఆగస్ట్ బెర్తోల్డి.**

* శాస్త్ర విజ్ఞానం: 5. హిమోఫిలస్ పెర్టుసిస్ అనే బాక్టీరియా కలిగించే వ్యాధి **వూఫింగ్ కాఫ్.**